క్లుప్తంగా

తాగునీటి సమస్యలకు పెద్దపీట

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



బోరు మోటార్లకు సంబంధించిన మంజూరు పత్రాలను సర్పంచులకు ఇస్తున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు: గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కాబ్బల్లె, జరావారిపల్లె పంచాయతీల్లో రెండు బోర్లను వేసి వాటికి మోటార్లను బిగించేందుకు రూ.15లక్షలు ఖర్చు చేశామన్నారు. దీనికి సంబంధించిన ఆదేశాల నకలును అక్కడి సర్పంచులకు ఆయన అందజేసి మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వస్తే జెడ్పీ నిధులతో పనులు చేస్తున్నట్టు చెప్పారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్మన్‌కు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్, సర్పంచులు జగన్‌మోహన్‌రెడ్డి, విజయ్, గోవిందు, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

11న ఉచిత కంటి వైద్య శిబిరం

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూలు ఆవరణలో ఈనెల 11న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చెన్నై శంకరనేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మానస క్లినిక్, పున్నమి బేకరి నిర్వాహకులు తెలిపారు. ప్రతినెలా రెండవ ఆదివారం ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎంపిక చేసిన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలియజేశారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



పుంగనూరు: పట్టణంలోని శ్రీమాణిక్య వరదరాజస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమం సెప్టెంబర్ 19 వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా అయ్యప్ప భక్తులకు ఈ వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

సీఐగా సోమశేఖర్‌రెడ్డి



వి.కోట: వి.కోట సీఐగా సోమశేఖర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా ఉన్న లింగప్ప వీఆర్‌కు వెళ్లడంతో కర్నూలు నుంచి బదిలీపై సోమశేఖర్‌రెడ్డి వచ్చారు. ఆయన మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల కూడలి అయిన వి.కోట మండలంలో అంతర్రాష్ట్ర ముఠాను అదుపు చేయడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

పార్కు ప్రాంతానికి కంచె



పార్కు ప్రాంతంలో వేస్తున్న కంచె

వి.కోట: మండలంలోని వి.కోట కీలపల్లె చెరువు కట్టపై పంచాయతీ పార్కు ఏర్పాటుకు సంబంధించిన ప్రదేశం చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. ఈ పనులను ఈఓ యాదవపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు పరిశీలించారు. వారు మాట్లాడుతూ, పట్టణాన్ని సుందరీకరించాలనే ఉద్దేశంతో పార్కు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాంతం ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు చెరువు చుట్టూ కంచె వేయిస్తున్నట్టు తెలిపారు.

కస్తూర్బా స్కూల్‌ను పరిశీలించిన న్యాయమూర్తులు



కస్తూర్బా సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయమూర్తులు ఉమాదేవి, బావాజాన్

పుంగనూరు: పట్టణంలో నక్కబండలోని కస్తూర్బా పాఠశాలను న్యాయమూర్తులు ఉమాదేవి, షేక్ బావాజాన్ పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలలో భోజన పథకాన్ని, మరుగుదొడ్లు, స్కూల్ ప్రాంగణంతో పాటు హాస్టల్‌లో విద్యార్థులకు ఉన్న వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. ప్రిన్సిపల్, సిబ్బందితో చర్చించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

నాగమ్మా..! చల్లంగా చూడమ్మా..



రాయలపేటలో పూజలందుకున్న నాగదేవతలు



పుంగనూరు: నాగదేవతలకు పూజలు చేస్తున్న మహిళలు

పెద్దపంజాణి: మండలంలో నాగుల చవితి పర్వదిన వేడుకలను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, ఉపవాస దీక్షలతో పుట్టల వద్దకు కుటుంబ సభ్యులతో వెళ్లి పూజలు చేశారు. అందరూ బాగుండాలని ఆకాంక్షిస్తూ మొక్కులు చెల్లించారు. పుట్టలో పాలు, గుడ్లు, నువ్వుల చిమిలి మొదలైన వాటిని నైవేద్యంగా సమర్పించారు. వివిధ రకాల పుష్పాలతో నాగేంద్రుని ప్రతిమలను సుందరంగా అలంకరించారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలు అందజేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక శేషాద్రిస్వామి ఆలయం వద్ద నాగదేవతల రాళ్లకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వేపచెట్టు, రావిచెట్టు కింద నాగదేవత రాళ్లను మంచినీటితో శుభ్రం చేసి పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించి పూజలు అనంతరం పుట్ట వద్ద పాలు పోసి మొక్కులు చెల్లించారు.

పుంగనూరులో..

పుంగనూరు: నాగులచవితి సందర్భంగా స్థానిక కోనేటి వద్ద ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం శ్రావణ మాసంలో వచ్చిన తొలి పండుగ కావడంతో నాగపంచమిని మహిళలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. నాగదేవతలకు పాలు పోసి చలిపిండి పెట్టి, మొక్కులు చెల్లించారు. నాగచవితి రోజు సోదరుల సంక్షేమం కోరుతూ అక్కచెల్లెళ్లు పూజలు చేయడం ఆనవాయితీ.

చౌడేపల్లె మండలంలో..

చౌడేపల్లె: మండలంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో తొలి శ్రావణ మాసపు శుక్రవారంతోపాటు నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. చౌడేపల్లె, కరణంవారిపల్లె, కొండామర్రి, ఊటూరు, జంగాలపల్లె తదితర గ్రామాల్లోని నాగదేవతల రాళ్లకు పూజలు చేశారు. పుట్టలకు పాలు, గుడ్లు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో సాంప్రదాయరీతిలో అర్చనలు ,అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. తొలి శ్రావణమాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మూడువేల మంది భక్తులకు ఉచిత అన్నప్రసాదాల వితరణ చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: శ్రావణమాసం తొలి శుక్రవారం స్థానిక శ్రీవిరూపాక్షి మారెమ్మకు రాహుకాల పూజలు చేశారు. అమ్మవారిని గాజుల మాలలు, పసుపు దారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూలు, నిమ్మకాయలు, గుమ్మడికాయలు ఉంచి దిష్టి నివారణ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి చలిపిండి, నేతి దీపాలు, చల్లముద్ద పెట్టి మొక్కులు చెల్లించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



బోయకొండలో అమ్మవారు



పుంగనూరులో విరూపాక్షి మారెమ్మ



బైరెడ్డిపల్లెలో..



చౌడేపల్లె: కరణంవారిపల్లెలో..

చైర్మన్ పదవిపై పచ్చనేతల చిచ్చు

- వైఎస్సార్ సీపీ నేతకు విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతు
- తమ వర్గీయులకే పదవి కట్టబెట్టాలని టీడీపీ నాయకుల ఓవరాక్షన్
- ఇరువర్గాల నడుమ వాగ్వాదం
- ఎంఎస్‌సీ ఎన్నికలను వాయిదా వేసిన అధికారులు
- ఆపై, గుట్టుగా చైర్మన్ పదవిని టీడీపీ వర్గీయులకు కట్టబెట్టిన వైనం!
- విద్యార్థుల హాజరుపై ప్రతికూల ప్రభావం



కీలతొరిడి పాఠశాలకు హాజరైన విద్యార్థులు

బైరెడ్డిపల్లె: స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో పచ్చనేతల ఓవరాక్షన్ విద్యార్థుల హాజరుపై పడింది. ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వైఎస్సార్ సీపీ నేతకే మద్దతు తెలిపినప్పటికీ, టీడీపీ నేతలు మాత్రం తమకు మద్దతు లేకపోయినా చైర్మన్ పదవి తమకే కావాలని పట్టుబట్టారు. వారి ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు, టీచర్లు గుట్టుగా చైర్మన్ పదవిని టీడీపీ వర్గీయులకే కట్టబెట్టారు. శుక్రవారం ఇది మండలంలో చర్చనీయాంశమైంది. వివరాలు.. మండలంలోని కమ్మనపల్లె సచివాలయ పరిధిలోని కీలతొరిడి ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎస్ఎంసీ ఎన్నికలను ఈనెల 8న నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నేతకే విద్యార్థుల తల్లితండ్రులు మద్దతు తెలిపారు. అయితే టీడీపీ నేతలు మద్దతు లేకపోయినా ఎస్ఎంసీ చైర్మన్ పదవి తమవారికే కావాలని పట్టుబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, తహసీల్దార్ మాధవరాజు, పోలీసులు అక్కడి చేరుకున్నారు. ఎన్నికలను వాయిదా వేశారు. అయితే చైర్మన్ పదవిని మూడోకంటికి తెలియకుండా పచ్చనేతలకే ఉపాధ్యాయులు, అధికారులు కట్టబెట్టారు. ఇది బయటకు పొక్కడంతో శుక్రవారం విద్యార్థులను కొంత మంది తల్లితండ్రులు పాఠశాలకు పంపకపోవడంతో కేవలం 11 మంది మాత్రమే హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నేతలకు ఇచ్చేంతవరకు విద్యార్థులను పాఠశాలకు పంపబోమని తల్లితండ్రులు తేల్చిచెప్పారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం

- కూటమి నేతల దాష్టీకాన్ని ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు

పలమనేరు: విజయవాడలోని భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ స్మృతి వనం వద్ద శిలా ఫలకాన్ని కూటమి నాయకులు ధ్వంసం చేయడం హేయమని, విగ్రహ ధ్వంసానికి యత్నించడం దుర్మార్గమని పలమనేరు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతలు ఖండించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలోఅంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేడ్కర్ స్మృతి చిహ్నంగా 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని వైస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారన్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులు రాష్ట్రంలో లెక్కలేనని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేశారని, ఇప్పుడు ఏకంగా భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని టార్గెట్ చేశారని నిరసించారు. ఇది రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానంగా, ప్రజాస్వామ్య ఖూనీగా భావించాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం కూడా విగ్రహాలు, ఆస్తుల ధ్వంసంపై ఉదాసీనంగా వ్యవహరిస్తూ, వారికే కొమ్ము కాస్తోందని దుయ్యబట్టారు.

బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మిలటరీ సిద్ధయ్య

పలమనేరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలపై ప్రపంచదేశాలు స్పందించాలని, అక్కడి హిందువులను కాపాడాలని హిందూ ధార్మిక సంఘ నేత మిలటరీ సిద్ధయ్య కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండిస్తూ స్థానిక టవర్ క్లాక్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో కొన్నాళ్లుగా హిందువులపై దాడులు, దేవాలయాల ధ్వంసం, హిందూ మహిళలపై సామూహిక అత్యాచారాల ఉదంతాలను ఏ ఒక్క దేశం కూడా ఖండించడం లేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు పాకిస్తాన్‌కు చెందిన 95,700మంది యుద్ధఖైదీలను ఇందిరా విడిచిపెట్టిందన్నారు. అయితే అక్కడ ఖైదీలుగా ఉన్న మన సైనికులు 54 మందిని మాత్రం విడిపించుకోలేకపోయిందన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ విధానాలతో దేశానికి ఎన్నటికైనా ముప్పు తప్పదన్నారు. నిరసనలో తాతయ్య, శివకుమార్, సుదర్శన్, బాలాజి, శీనా, ప్రకాష్, చెంచురెడ్డి, ఆంజనేయులు, కోటి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

- మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన సమాజం
- యువతకు డీఎస్పీ హితవు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఎస్పీ

గంగవరం: యువత మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులు, మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోరాదని పలమనేరు డీఎస్పీ రఘువీర్‌విష్ణు హితవు పలికారు. మండలంలోని మదర్‌థెరిసా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఉద్దేశించి డీఎస్పీ మాట్లాడారు.విద్యార్థి దశనుంచే మంచి నడవడికతో భవితకు బాటలు వేసుకోవాలని, వ్యసనాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోరాదన్నారు. మంచి స్నేహితులు, మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి చేరుకునేందుకు పట్టుదలతో ముందుకుపోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్, పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించి నలుగురు విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో గంగవరం సీఐ చిన్నగోవింద్, కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కుప్పం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం కుప్పం నియోజకవర్గం అల్ ఇండియా బంజారా సేవా సంఘ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌జీఓ భవనంలో నియోజకవర్గంలోని గిరిజనులు సమావేశమయ్యారు. అడవులపై ఆధారపడిన జీవిస్తున్న ఆదివాసులు జీవన విధానాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం వివరించారు. ప్రభుత్వ రిజర్వేషన్ల ఫలాలు అందుకుని గిరిజన వర్గాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రవి నాయక్, సభ్యులు శివాజీ నాయక్, కామరాజ్ నాయక్, చంద్రబాబు నాయక్, స్థానిక టీడీపీ నాయకులు సత్యేంద్ర శేఖర్, డాక్టర్ వెంకటేష్, శాంతరాం తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు



రైతు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

గంగవరం: రైతులకు డ్రిప్స్, స్ప్రింక్లర్ పరికరాలను రాయితీ ధరకు ఇస్తున్నట్టు పుంగనూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కల్లుపల్లెలో దీనికి సంబంధించి నిర్వహించిన రైతుల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. బిందు సేద్యం రైతులకు నీరు, ఎరువులు ఆదా చేసేందుకు సహాయపడే ఈ పరికరాలు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులతోపాటు 5–10 ఎకరాలు కలిగిన రైతులకు ఎంతెంత సబ్సిడీ ఇస్తారో తెలియజేశారు. ఆసక్తి కలిగిన రైతులు ఆధార్ కార్డు, 1బి, మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమలత, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవాలి

రొంపిచెర్ల: పీఎం కిసాన్‌కు ఫోన్ నంబర్‌ను రైతులు అనుసంధానం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఎం కిసాన్‌కు ఫోన్ నంబర్ అనుసంధానికి కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం అవకాశం కల్పించిందన్నారు. మీ–సేవ కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లు, రైతు సేవా కేంద్రాల్లో ఫోన్ నంబర్ నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే అవసరమైన పక్షంలో ఫోన్ నంబర్‌ను మార్పు కూడా చేసుకోవచ్చని చెప్పారు. అనుసంధానం వల్ల ఈకేవైసీ సులభంగా చేసుకోవచ్చని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పచ్చని పాఠశాలలే లక్ష్యం



కొలమాసనపల్లెలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పలమనేరు: పచ్చదనం పెంపుతో పచ్చని స్కూళ్లగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకుపోవాలని స్థానిక నాగమణి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సీతారామయ్య కోరారు. శుక్రవారం విద్యార్థులకు పలు మొక్కలను పంపిణీ చేశారు. కొన్ని మొక్కలను బడి ఆవరణలో నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

పలమనేరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల పునశ్చరణ తరగతుల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం కూర్మాయి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తులకు తడి చెత్త, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాజేష్, ఈఓఆర్డీ బాలరాజు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన బైక్ సైలెన్సర్లు ధ్వంసం

పలమనేరు: పట్టణంలో కొన్ని రోజులుగా సైలెన్సర్ తీసి మితిమీరిన వేగంతో మోటార్ సైకిళ్లు నడుపుతున్న వారిని గుర్తించి, సైలెన్సర్లను సీజ్ చేసిన పోలీసులు వాటిని శుక్రవారం జేసీబీతో ధ్వంసం చేశారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ, పట్టణంలో ఎవరైనా వేగంగాగానీ, పెద్దపెట్టున శబ్దం చేస్తూ బైక్‌లను నడిపితే పరిణామాలు ఇలాగే ఉంటాయని హెచ్చరించారు.



బైరెడ్డిపల్లె: స్థానిక విశ్రాంత వీఆర్‌ఓ కృష్ణమూర్తి పెరట్లో శుక్రవారం 30 బ్రహ్మ కమలాలు విరబూశాయి. శ్రావణమాసం శుక్రవారం బ్రహ్మ కమలాలు విరబూయడంతో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ఈ పూలను ఆసక్తిగా తిలకించారు.

శిక్షణ తరగతుల తనిఖీ



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ప్రసాద్

రొంపిచెర్ల: గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తతో ఎరువును తయారు చేయాలని రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచుల శిక్షణ తరగతులను తనిఖీ చేశారు. సాయంత్రం రొంపిచెర్ల డంపింగ్ యార్డును పరిశీలించి పైవిధంగా ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప ఆచారి, ఈఓఆర్డీ నాగరాజ, శిక్షణ తరగతుల రిపోర్స్ పర్సన్ యుగంధర్, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు



గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్

రొంపిచెర్ల: గర్భవతులు క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆస్పతులలో వైద్య పరీక్షలు చేసుకోవాలని డాక్టర్ వినయ్ కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ, గర్భవతులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసుకోవడంతోపాటు ఆస్పత్రులలోనే కాన్పులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం కూడా అందజేస్తాయని, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్ వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య శిశువులకు జన్మ



పౌష్టికాహారం అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

బైరెడ్డిపల్లె: గర్భవతులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్ చంద్ర అన్నారు. మహతి ఫౌండేషన్ సహకారంతో గర్భవతులకు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గర్భిణులు తాజా కూరగాయలు, పండ్లు, కోడి గుడ్లు బాగా తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అలాగే తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారి అరుణ్‌కుమార్ గర్భవతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లెలో శుక్రవారం శ్రీ వరదాంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రాణ ప్రతిష్ఠ చేసి వేద పండితులు హోమాలు చేశారు. ఆలయంపై మహా కలశాల స్థాపన అనంతరం ఆలయ ఆవరణంలో సీతారాములు కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు స్వామివారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా ఈ తంతు ముగించారు. ప్రత్యేక అలంకరణతో ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.